


# తాతయ్యతో ప్రయాణం

పండగ సెలవుల్లయిపోయాయి. నేనూ, సుబ్బారావూ-అంటే మా బావ యిద్దరం కాలేజీకి బయలుదేరాం. ఎల్లుండి తే కాలేజీ తెరుస్తారు. సరిగ్గా పదిగంటలకి భోజనం చేసి బస్సెక్కాం. బస్సు కొంత మేర, రైలు కొంతమేర-ఎలాగైనా సాయంకాలానికి విశాఖపట్నం చేరాలి. ఓ పది హేనురోజులాయి సినిమాకి వాచిపోయివున్నామేమో-ఒక్కగంతునపోయి హాల్లో పడాలి. అదీ మా పట్టుదల. రాత్రిబండికి వెళుదురు గానని మా మామయ్య అన్నా, మేం అంగీకరించలేదు సూడా.

కండక్టరు మాకు తెలిసినవాడు. వస్తున్నామని కబురు చేస్తే రెండుసీట్లు ఖాళీగా వుంచేసు మాకోసం. ఫ్రంటుసీటు వుంచుదా మనుకొన్నాట్టగాని వాళ్ళ ప్రొప్రయిటరూ, ఇంకో అధికారి ఎవరో వస్తారనీ వీలుకా లేదనీ మాతో సవినయంగా విన్నవించుకొన్నాడు. అంతట మా బావ "పోనీలే యిప్పుడు మునిగిపోయినది లేదు" అని నాయకుని హోదాలో జవాబు యిచ్చాడు. రెండోసీట్లో చివర యిద్దరం ఒకరికొకరం యెదురుగా కూచున్నాం. దూర ప్రయాణమాయెను. రెండుగంటలు నడుస్తుంది బస్సు. కనుక దారిలో యెక్కేవాళ్ళూ దిగేవాళ్ళూ యెక్కువ. అంచేత ముందుకూచుంటే జనం తాకిడికి మోకాళ్లు వాచిపోగలవు. కనుక వెనక్కిపోవలసి వచ్చింది. అదే మాకు సురక్షితస్థలమని యెంచుకుని కూచున్నాం. నేను డ్రయివరుకు వెనకగా కూచున్నాను. నా ప్రక్కన మరొకాయన యెవరో తెలీదు, ఖద్దరు వస్త్రధారి అని మాత్రం చెప్పగలను కూచున్నాడు. ఆ తరువాత ముగ్గురు కాబోలు స్టూడెంట్సు కూచున్నారు. మా ఎదుటి సీటులో నా కెదురుగా మా బావ, ఆ తరువాత ఒక జవదార్కీ, ఇంకా మరొక రిద్దరు కుర్రాళ్ళూ ఆ తరువాత-అంటె మొట్ట మొదటి స్థలంలో-ఒక కళ్ళద్దాలాయనా కూచున్నారు. ఆయన్ని చూస్తూంటే "కకబిక, బెక బెక"లు జ్ఞప్తికొచ్చేరు.

పి. వి. పల్లి

మా రెండుసీట్లకూ వెనకవున్న సీట్లు అన్నీ పూర్తవగా మధ్యను క్రిందను సుమా రాయగురు కూర్చున్నట్లు జ్ఞాపకం. బస్సు కదులుతుం దన గానే ఫ్రంటుసీట్లో ప్రొప్రయిటరు, డ్రెస్సులో వున్న ఒక పోలీసు అధికారీవచ్చి కూచున్నారు. డ్రయివరు ఆయనకి సెల్యూట్ చేశాడు. క్లీనరు తలుపు బంధించి వెనక్కిపోయాడు. కండక్టరు "రైట్" అన్నాడు. "ఘీం" కారంతో బస్సు బయల్దేరింది. నాలు గడుగులు వెళ్ళిందో లేదో బస్సు ఆగిపోయింది. వెనక్కి చూచాను. కాని నిక్కరు, లాల్చీ(లాల్చీలోపల పెట్టాడు)తలమీద హేటూ, పాదాలకి బూటూ - పోలీసు అధికారల్లే వున్నాడాయన. బస్సుదగ్గరికి వచ్చి "నాకు సీటు కావాల"న్నాడు. కండక్టరు సెల్యూట్ చేసి, చేరువగా వెళ్ళి చేతులు జోడించి "తమకభ్యంతరం లేకపోతే సెకండు సీ..." అంటూండగానే, అయన "ఫరవాలే"దన్నాడు. నేను కూర్చున్న సీటులో ముందరనే- కళ్ళజోడాయన కెదురుగా కూచున్నాడు. మళ్లీ బస్సు కదిలింది.

"పై అధికారి వస్తే ముందుసీట్లోంచి లేవలేదేం ఆ డ్రెస్సులోవున్న హెడ్ కానిస్టేబులు?" బావ మెల్లిగా ప్రశ్నించాడు నన్ను.

"వాడు హెడ్ కానిస్టేబులని నీకేం తెల్సు?" అడిగాను.

కథానిక

"నాకు తెలుసు"నన్నాడు బావ.

"ఏమోమన కేం?" అన్నాను నేను.

గడ్డాలాయన (జటాధారి) అందుకుని- "కాల మహిమ" అన్నాడు.

"ఔనుమరి" అన్నాడు బావ.

బస్సు కొంతదూరం నడిచింది. మా రెండు సీట్లలో మాముందు కూచున్న యిద్దరి గొంతులూ వినబడుతున్నాయ్-

"మీరేవూరెడుతున్నారు?" ప్రశ్నించాడు కాకీదుస్తులాయన.

"విజయవాడ" అన్నాడు కళ్ళజోడాయన.

"అక్కడ మీరేంచేస్తున్నారు?"

"ఫిలిం రిప్రజెంటేటివును. ఈవూరు ఫిలింతో వచ్చాను. మళ్ళీ మావూరు వెళిపోతున్నాను."

"అలాగా. అయితే 'చంద్రహారం' ఎలా పోతూంది?"

"దానికేం బాగా నేపోతూంది. అందులోనూ నిర్మాతల పేరు వింటేనే డబ్బు వస్తుందాయెను. విజయవాడలో అయిదువందల రిక్షాలు అట్టలు కట్టుకు వూరేగేయి, పబ్లిసిటీ యింతా అంతానా?"

"లోని సరుకు- అంటే కథలో బిగువు వుందంటారా?"

"ఆ సంగతి నేనేం జెప్పేది? యింతకూ మొదటనే చెప్పానుకదూ నిర్మాతల పేరు బలమని."

"అవున్లెండి - అదికూడా నిజమేనాయెను" అన్నాడు కాకీదుస్తులాయన, సంభాషణ ముగించే వుద్దేశంతో.

మాబావ చేతిలో ఉన్న పత్రిక జోరుగా చదువుతున్నాడు. ప్రస్తుతానిదికాదు- రెండువారాల వెనకది. గడ్డాలాయన- ఆయనని "తాతగారు" అంటాను, "ఏమిటబ్బాయి ఆ పుస్తకం- యేదీ చూదా" మని అందుకున్నాడు బావ చేతిలోంచి. పేజీలు తిరగేసి, ఒకదగ్గిర చదువుతున్నాడు. కళ్ళదగ్గిరగా పుస్తకం పెట్టుకుని.

నా వెనకగా మాటలు వినబడుతున్నాయి-

"నువ్వు బాగా నడపగలవోయ్!"

వెనుదిరిగి చూచాను. ఆపోలీసాయన అంటున్నాడు డ్రయివరుతో. డ్రయివరు మరీ స్పీడుగా పోనిస్తున్నాడు బస్సుని. హాయి, హాయి మంటున్నది. గాలి ప్రక్కలనుంచి లోపలికికొడుతున్నది. చెవులు గింగురు పెడుతున్నాయి.

ఇంతలో "స్టాప్" అని వెనకనుండి కేక వినబడ్డంతోటే బస్సు ఆగింది. ఇద్దరు దిగారు. నలుగురు యెక్కారు. వెనక సీట్లలో వున్న ఒకాయన అడిగాడు కండక్టరుని, "ఎంతకని ఓవర్లోడు చేస్తావయ్యా-హద్దుండక్కర్లేదూ?"

"ఇది యేమంత పెద్ద ఓవర్లోడు కాదులెండి- నిజంగా ఓవర్లోడయితే మీరు యింకా ఏమందురో" అని జవాబిచ్చి, తన పనిలో తాను నిమగ్నమయి సీట్లలో మనుషుల్ని పరకాయించ మంటున్నాడు.

ఒకావిడ అన్నదిగదా— "ఎక్కడయ్యా పరకాయించడం. ఇప్పటికే కాళ్లు నెప్పులు పెడుతున్నాయి."

"యెల్లాగమ్మామరి? ఏదో సరిపుచ్చుకోవాలె" అని సమాధానపరిచాడు.

ఆ వెనకసీట్లోనే ఒకాయనెవరో "వెధవది కాశ్మీరుసమస్య యింతవేగం తేగేట్లు లేదు-" అన్నాడు పేపరుచదువుతూ.

"మనబస్సు ఓవర్లోడు సంగతీ అల్లాగేవుంది" అన్నాడు యిందాకటి పెద్దమనిషి. అందరూ ఫకాలున నవ్వారు.

మా తాతయ్య అందుకున్నాడు.

"ఏంరాతలయ్యా, ఛందస్సు అక్కర్లేకుండానే కవిత్వం చెయ్యొచ్చునట. అందులో ఏం పసవుంటుంది? ఒక్కరోకళ్ళపాటల్లా గేయాలట - గేయాలు-" విసుక్కుని పేజీలు తిప్పాడు.

"అదే నవకవిత్వమండీ" అన్నాడు బావ అందుకు సమాధానంగా.

"ఏడిచినట్లేవుంది. లక్షణంగా మంచిమంచి సమాసాలూ, సంధులూ - వ్యాకరణయుక్తంగా ఛందోబద్ధంగా - రకరకాల అలంకారాలతో పద్యం అల్లితే ఎంతసొంపుగా వుంటుంది కవిత్వం! చూడు పిల్లలమర్రి "వాణీనారాణీ" అన్నాడు. అంటే అంతబాగా కవిత్వం చెప్పగలడన్న మాట" ఇంకా ధోరణి వెళుతునేవున్నది. బావ అడ్డొచ్చి, "తాతగారూ అవి పురాతన పద్ధతులండీ - యిప్పుడంతా నూతనం. నూతనభావాలూ, నూతన కవిత్వాలూను. ఆ కాలానికి ఆ విధానాలూ, ఇప్పటికి

ఈ విధానాలూనూ. అది పురాతనయుగం, ఇది నవయుగం-”

“చాల్లేవోయ్ - వెధవ నవీనం - ఇదొకటి బాగాదొరికింది వూతపదం. అప్పుడు ఏ మహారాజో కవుల్ని ఆదరించేవాడు. కవిత్వం ఎంత బాగానడిచేది. కాని ఇప్పుడు ఆదరించేవాడేలేడు. అప్పుడు ఆ కవిత్వంలోమాత్రం భావాలులేవా? అర్థంచేసుకోలేకపోతే సరి.” చీదరించుకున్నారు తాతగారు.

ఎల్లాగయినా యీ సంభాషణని అంతం చెయ్యాలనిపించింది.

“ఇప్పుడు ఆంధ్రరాజధాని విశాఖపట్నమే అవుతుందంటున్నారు” అన్నాను.

నా ప్రక్కనున్నాయన అందుకుని- “ఏదో లెండి. అందాకా ఎలాగో ఒకలాగు గడుపుతే ఆ తరువాత యెలాగూ విశాలాంధ్ర వస్తుంది. అప్పుడు హైదరాబాదు శాశ్వతరాజధానిగా విలసిల్లుతుంది.” అన్నాడు.

తాతగారూరుకోక “అవునయ్యా అవును. తెల్లారిలేచి గంట గంటకూ పార్టీలు మారుతూ, నీతి నియమంలేకుండా, పట్టుదలలేకుండా అంతా స్వార్థాన్నే చూచుకుంటూ తయారవుతున్నారందరూ. ఇక విశాలాంధ్ర తప్పకుండావస్తుంది” అన్నారు.

వూరికే గెడ్డాలు పెంచుక్కూచున్న యీయనికి రాజకీయాల్లోకూడా ప్రవేశమున్నదే! అని ఆశ్చర్యపడ్డాను. నాకు రాజకీయాలంటే మహ చెడ్డ సరదా.

“వున్నమాటన్నారు తాతగారూ” అన్నాడు బావ. నేను “భళీ” అని తాళంవేశాను బావ మాటకి. ఖద్దరుగుడ్డలాయన వూరుకున్నాడు.

స్వార్థమంటే జ్ఞాపకమొచ్చింది. యిటీవల విడుదలయిన “అంతా మనవాళ్ళే” చిత్రం యీ విషయాన్నే వెళ్ళబుచ్చుతున్నది”అన్నాడు ఫిలిం రిప్రజెంటేటివు.

“మనం పుట్టింది- పెరుగాతున్నది - అందుకే గదటయ్యా” అన్నాడొకాయన, ఎవరో వెనక నించి.

“ఖైదీలందర్నీ విడుదలచేశారు సంక్రాంతికి” చదువుతున్నాడొకాయన పేపరు. తాతయ్యా అన్నాడు, “అవును-ఆంధ్రరాష్ట్రం అవతరించినందుకు సంతోషకారణంగా. అయితే...”ఏదో అనబోయి వూరుకొన్నాడాయన.

“ఉత్తరోత్తరా ‘యిప్పటి మంత్రులు చాలా మంచివాళ్లు, మళ్ళీ వీళ్ళకే వోట్లియ్యండి’ అని కాన్వాస్ చెయ్యడానికా?” అన్నాడు బావ. ఖద్దరు వస్త్రధారి మొహం కందగడ్డలా అయింది.

“పోలీసులకి మళ్ళీ బాగా పని తగులుతుంది” అన్నాలు బావ. నా సీటు ముందాయన యిటు తిరిగి చూచాడు. నా వెనకకావున్న ఫ్రంటు సీటులో వున్నాయన ఏదో గొణుగుతున్నట్టనిపించింది. వెంటనే డ్రయివరు నవ్వాడు.

రిప్రజెంటేటివు అన్నాడు, “వాళ్లకి ఎప్పుడూ పనే. తీరికనేది వుండదు. కనక ఈ విషయంలో వాళ్ళకి ప్రత్యేకంగా మరికొంతబాధ్యతతగలదు.”

“ఉన్నమాటన్నారండీ - చచ్చిపోతున్నాం. అప్పుడు కమ్యూనిస్టులతో పడలేకపోయాం- యిప్పుడు వీళ్ళతోటి. ఎప్పుడూ వున్నదే యిది. అంతేగాకుండా మా చేతిలో ప్రొహిబిషన్ కూడ పెడుతున్నారు.” అన్నాడాయన.

ఇంతట్లో బస్సు ఆగింది. ఎవరో ఒక సన్నపాటాయన వచ్చి తాతగారికీ, మాబావకీ మధ్యను కూచున్నాడు. బావ అతనివేపు అదేపనిగాచూస్తున్నాడు. కళ్ళు యెర్రగా వున్నాయి. తాతయ్య ఏవగించుకుంటున్నాడు.

“ఆఁ... ఏమంటున్నారు? ప్రొహిబిషనా? వెధవది వుంచనిద్దురూ. యిప్పుడు వుంటే యేం పోయింది?” అన్నాడాయన-ఎర్రకళ్ళ మనిషి.

“అవును అలాగేమరి...” బావ నింపాదిగా గొణుక్కున్నాడు.

“ఓ కమిటీ కూడా బయల్దేరింది” అన్నాను.

“అవునవును. దానికేకాకుండా గవర్నరుగారు ఆంధ్రలోని ఖనిజసంపదను గూర్చి తెలపడానికి ఒక కమిటీని వెయ్యమంటున్నారు. చేనేత పరిశ్రమ గూర్చి ఒక కమిటీ వెయ్యబడేట్లుంది. ఇటీవల ప్రాథమిక విద్యావిధాన నిర్ణయానికి కూడా కమిటీ యేర్పాటు అయింది” అన్నారు బావ.

“ఇది ఒట్టి కమిటీల ప్రభుత్వం లాగుంది. మంత్రుల్లో మళ్లీకమిటీలట!” అన్నాడు తాతయ్య.

"అలాగే మా ఫిలిం పరిశ్రమనుగురించికూడా ఒక కమిటీని యేర్పాటుచేసి దాని భవిష్యత్తుని నిర్ణయిస్తే బాగుండును" అన్నాడు .రిప్రజెంటేటివు.

"మంచి సలహా యిచ్చావయ్యా" అన్నాడు ఖద్దరాయన.

"ప్రాథమిక విద్య యెంత దిగజారిపోయిందో చూడండి. మారోజుల్లో పదేళ్ళ కుర్రాడు భాగవతం, రామాయణం, భారతం తుణ్ణంగా చదివేవాడు. పద్దీలు, వేరీజులు, బజారులెక్కలు బాగా చేసేవాడు. అప్పటి పద్ధతి యెంత బాగుండేది! ఇప్పుడు అక్షరాలక్కర్లేకుండానే చదువు. ఎక్కాలు లేకుండానే లెక్కలు. రెండుపూటలక్కర్లేక ఒక్కపూటతోనే పూర్తిపాండిత్యం-అహహా- ఎంత బాగుంది!" యీసడించాడు తాతయ్య. నాకు కోపం వచ్చింది. అంతా తన 'పాత' బాగుంటుందంటాడు 'కొత్త'కన్న.

మా మాటలసందడిలో బస్సు చాలాదూరం వచ్చేసింది. ఇంకా అరగంట ప్రయాణంవుంది.

ఒక వూరిమధ్యగుండా బస్సువెళ్ళాలి. వూరిమధ్యను బస్సు ఆగింది. తాతయ్యగారి దృష్టి మా కెదురుగా వున్న మంగలిసాపుమీద పడింది.

'భారత క్షౌరనిలయము' చదివాడు తాతయ్య.

"ఓహో ఏండెవలప్ మెంటు! ఆ మధ్య బెజవాడలో ఒకచోట 'ఆంధ్రరత్న క్షౌరనిలయము' అని రాసివుంది. ఇంకొకచోట 'గాంధీ క్షౌరశాల' అని రాసివుంది. ఏం గలిపట్టిందిరా ఆ నాయకులకి." యీసడించారు తాతయ్యగారు.

"ఆఖరికి ఆమెరికా పాకిస్తాన్‌తో వచ్చి యుద్ధానికి దిగేట్లు వుంది'' అన్నాడు కాస్త లంబుగా వున్న ఒకాయన వెనకసీట్లోంచి.

"ఏమో ఎవరం చెప్పగలం? ఇంతకీ నెహ్రూ సాధ్యమయినంతమట్టుకి అలా జరగనివ్వడు. యుద్ధం జరక్కపోవచ్చును" అన్నాడు యింకొకాయన.

తాతయ్య వెనక్కి తిరిగిచూశారు. మళ్ళీ యిటు తిరిగి.

"ఏదో కొట్టుకు చావనివ్వండి. అమెరికా గాడికి-రష్యామీదవుంది కన్ను. కొరియా యుద్ధం జరక్కుండా ఇండియా ఆపింది. కనక ఇండియాని యుద్ధంలోకి దింపితేగాని లాభంలేదు. ఇండియా ప్రక్క రష్యా వుంటుంది అని అమెరికా వుద్దేశం" అన్నాడాయన.

"ఎంతబాగా చెప్పారండీ" అన్నాడు ఖద్దరాయన.

బస్సు మళ్ళీ ఆగింది. కొందరుదిగారు ఇంకొందరు ఎక్కారు. ఇంకా పావుగంట వుంది ప్రయాణం. చికాకనిపించేది యింతకు ముందెప్పుడూ బస్సు ప్రయాణం. ఇవాళ హేమాహేమీలందరూ యింటులో సమావేశమవగం అదృష్టమే అనిపించింది. వూసుపోయింది.

తాతయ్య అడిగాడు నన్ను-"అబ్బాయ్ ఎవరి తాలూకూ" అని.

చెప్పాను "పండక్కని వచ్చావా?" అడిగాడాయన.

నేను ఎవరి అబ్బాయినో చెప్పానుగాని ఇంకా మరేమి చెప్పకుండానే ఈప్రశ్న యెలా వేశాడో నాకు ఆశ్చర్యంవేసింది. తెల్లబోయి చూస్తున్నాను.

"నువ్వు కృష్ణమూర్తిగారి అల్లుడవు కావటోయ్? ఆయన మీ యింటిపేరు చెప్పి వాళ్ళ అబ్బాయి మాఅల్లుడని ఒకసారి నాతో అన్నారు" అన్నాడాయన.

నా అనుమానం తీరిపోయింది.

"ఏమిచ్చాడు కృష్ణమూర్తి పండక్కి?" అడిగాడాయన.

నేను చమత్కారంగా "అతను మా బావమరది" అన్నాను బావవేపు చూపించి.

బావని అడిగాడాయన "మీ బావకి యేమి యిచ్చారోయ్?" అని.

గెడ్డాలు పెంచుకుని బైరాగిగామారిన ఈయనకీ భోగట్టాయెందు కనుకున్నాను.

బావ యేదో చెప్పాడు.

"అవును నాయనా నేను అల్లుళ్ళతో పడ్డాను. చివరికి ప్రాణం విసిగిపోయింది."

"అందికే గాబోలు సన్యాసాశ్రమం స్వీకరించారు" నాలో నేను గొణుక్కున్నాను.

ఆ మాటలు విన్నారు కాబోలు- "కాదు నాయనా కోరుండి యిందులో దిగలేదు. ఇందులో నాకు పరమార్థం కనిపించింది.'' అన్నారాయన.

ఇంతలో బావ ఏదో సినిమాపత్రిక తీశాడు.

ఎవరో సినిమాతార వాఙ్మూలం చదువుతూ చదువుతూ "వీళ్ళకిదేపని కాబోలు" అన్నాడు.

"ఏమిటి?" తాతయ్య ప్రశ్నించాడు.

వాఙ్మూలం పైకిచదివి వినిపించాడు.

రిప్రజెంటేటివు యిటుదిరిగి అన్నాడు - "అదంతా అబద్ధం - పాపం వాళ్ళమీద అన్యాయంగా నిందలువేశారు."

"వీళ్ళకిదే వుద్యోగం. అయినా యిప్పటి సినిమాలు ఒట్టిచెత్త. పసందుగా పుణ్యపురుషుల జీవితాలుగాని, మహామంత్రుల జీవితాలుగాని, లేక ఒక గొప్ప వ్యక్తి జీవితంగాని చిత్రీకరిస్తే యెంత బాగుంటుంది. చూడండి, మల్లీశ్వరి చిత్రంలో శిల్పం యెంత బాగా చూపించాడో. శ్రీ కృష్ణ దేవరాయలి కాలంనాటి సంగతులు తెల్సుకోగలుగుతున్నాం. ఇంకా ఆయన ఆస్థానంలో వున్న తిమ్మరుసు - మహామంత్రి - అతని జీవితం చిత్రంగా తియ్యగూడదూ? కాళిదాసాది మహాకవులున్నారు. ఒకటేమిటి చరిత్ర తిరగవేస్తే యెన్నో యితివృత్తాలు దొరుకుతాయి. మన వాళ్ళకి చరిత్రఅక్కర్లేదు. సంస్కృతి అక్కర్లేదు. మన సాంప్రదాయాలు అక్కర్లేదు. ఎంత సేపూ విదేశీ నృత్యాలు, అర్థ నగ్నదృశ్యాలూ ఛీఛీ- అసహ్యించుకున్నాడు తాతయ్య.

తాతయ్యని అందరూ మెచ్చుకున్నారు. అన్ని విషయాలూ బాగా తెల్సు. అన్నిట్లోనూ పండిపోయాడాయన. అందుకే ఆయన్ని "తాతయ్య" అనడంలో తప్పులేదు. బస్సు రైలు స్టేషనుదగ్గర ఆగింది.

---

క థా ని క

# చీలిన ప్రేమ

"గోపి"

"బెడ్డింగు కట్టడం ఇంకా కాలేదా?" అని కొంచం విసురుగానే అడిగాడు ఆఫీసు గదిలోంచి శ్రీకాంత్.

"అన్నీ సిద్ధంగానే ఉన్నాయి. కొంచం మజ్జిగా అన్నం తినివెళ్ళరూ?" అని భయవినయ సమ్మిళితమైన లలిత గొంతుక సమాధానం ఇచ్చింది

"ఇల్లారా" అన్నాడు శ్రీకాంత్.

చేతినిండా శనగపిండి, రేగిన జుట్టుతో, సగం జారిన పయటను పిండి అంటకుండా, చేత్తో సరిజేసుకుంటూ లలిత వచ్చి నిలబడింది.

"ఇదంతా ఏమిటి?" అన్నాడు ఆమె చక్కని రూపాన్ని జాలిగా చూచి నిట్టూర్చి.

"ఏంలేదు నాలుగు బజ్జీలు వేస్తే మధ్యాహ్నం ఫలహారానికి పనికొస్తాయని" అని మెల్లిగా నమిలింది, కొసమాటిని భయంతో,

"ఇక్కడున్న నర్సీపట్టణానికేనా ఇన్ని ఫలహారాలూను?" అన్నాడు వేళాకోళంగా.

"నర్సీ పట్టణమా మీరు వెళ్ళేది" అని ఆత్రంగా అడిగింది. ఔనని తలూపాడు శ్రీకాంత్.

"ఆమె అక్కడే ఉందండీ ఓసారి చూస్తారా?" అన్న ప్రశ్నకి, "ఎవరా స్వరనామధేయురాలు" అని చీదరించుకున్నాడు.

"ఆమేనండీ!"

ఆడువారి చేతిలో సర్వనామాలు పొందే స్వతంత్రాన్నాలోచించి నవ్వుకుంటూండగానే జ్ఞాపకం వచ్చింది.

"బదిలీ ఐపోయిందన్నావ్?" అన్నాడు తరంగాల్లా వచ్చే ఆలోచనల్లోంచీ.

"మళ్ళీ వచ్చేశారుటండీ, మొన్ననే తెలిసింది ఒకరిద్వారా. దగ్గర్లో ఉన్నాం కనుక ఒకసారి రమ్మన్నదిట కూడాను..." జట్కా రావటం, మెతుకులు తినివచ్చి కోర్టు కాగితాలు చేత్తో పుచ్చుకు తోలమన్నాడు బస్‌స్టేండుకి.

బస్‌లో కూర్చున్నదగ్గరనుంచీ ఏది ఆలోచిద్దామన్నా "రజని" జ్ఞాపకం రావడం మొదలు పెట్టింది. మదరాసు వదలి విశాఖపట్టణం రావడం,